క్లుప్తంగా

గుంతల రోడ్లతో అవస్థలు


గోతులతో ఉన్న కె. కొత్తవలస రోడ్డు

సాలూరు రూరల్: మండలంలోని పలు గ్రామాల రోడ్లు గుంతల మయంగా మారాయి. అధికారంలోకి రాగానే 6 నెలల్లో రోడ్ల గుంతలు కప్పేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ఆ దిశగా పనిచేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొట్టుపరువు పంచాయతీ కె.కొత్తవలస రోడ్డు గుంతలమయమైంది. ఈ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వ శ్రీకారం చుట్టగా బూర్జివలస నుంచి కందులపథం బ్రిడ్జి రోడ్డును కలిపి వేయాల్సిన బీటీ రోడ్డు 80 శాతం పూర్తయింది. ప్రస్తుతం కందుల పథం బ్రిడ్జి రోడ్డు నుంచి కె.కొత్తవలస గ్రామం ముందు వరకు మిగిలి ఉన్న రోడ్డు నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం ఆ రోడ్డు పెద్ద పెద్ద గోతులతో ఇబ్బందికరంగా మారింది. రోడ్డు పనులు పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నయనానందకరంగా రామచిలుకల సమూహం


చెట్టుపై వాలిన రామచిలుకల సమూహం

సాలూరు: కాలుష్యకోరల్లో చిక్కుకున్న నేటి పరిస్థితుల్లో పక్షుల సమూహాలు కనుమరుగవుతూ వస్తున్నాయి.పక్షుల్లో రామచిలుకలకు ప్రత్యేక స్థానం ఉంది. గతంలో రామచిలుకలు ఉదయం, సాయంత్రం వేళల్లో సమూహాలుగా ప్రయాణిస్తూ ప్రజలను ఆకట్టుకునేది. ఇటీవల కాలంలో చెట్టుపై కనీసం ఒక రామచిలుక కనిపించినా గొప్పగానే భావించే పరిస్థితి ఏర్పడింది. అయితే పాచిపెంట మండలంలోని చెరుకుపల్లి జంక్షన్ వద్ద ఉన్న చెట్టుపై రామచిలుకల సమూహం బుధవారం సాయంత్రం చూపరులను ఆకట్టుకుంది. వర్షం కొంత సేపు ఆగిన నేపథ్యంలో పలు రామచిలుకలు ఆ చెట్టుపై వాలగా, ప్రయాణికులు తిలకించి ముగ్ధులయ్యారు.

నిబంధనలు సడలించాలి

- ఏపీ రైతు సంఘం డిమాండ్


వెలగవాడలో వరి పనలను పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘ నాయకులు


పాలకొండ రూరల్: ప్రస్తుత సీజన్‌లో వరుసగా కురుస్తున్న వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అన్నారు. వర్ష ప్రభావంతో మండలంలోని వెలగవాడ, వడమతో పాటు పలు గ్రామాల్లో తడిచిన వరి చేలను సంబంధిత రైతులతో కలసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తడిచిన, మొలకెత్తిన ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. అవసరమైతే నిబంధనలు సడలించాలని కోరారు. తీవ్ర ఆందోళనలో ఉన్న రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఈయన వెంట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వావిలపల్లి రమణమూర్తి, గుడివాడ నీటి సంఘం డైరెక్టర్ పామోటి వైకుంఠరావు, సీమల కాంతారావు, తదితరులున్నారు.

నిరంతర పర్యవేక్షణ


సిబ్బందికి సూచనలు చేస్తున్న విజయనగరం డిప్యూటీ సీఎంఈ, పార్వతీపురం మన్యం జిల్లా డీపీటీఓ శ్రీనివాసరావు

పాలకొండ రూరల్: ఆర్టీసీ సంస్థ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేలా నింతర పర్యవేక్షణ చేపడుతున్నామని విజయనగరం డిప్యూటీ సీఎంఈ, పార్వతీపురం మన్యం జిల్లా డీపీటీఓ కొట్నాన శ్రీనివాసరావు అన్నారు. షెడ్యూల్ – 3 పరిధిలో గల పాలకొండ – బూర్జ రహదారిలో బస్సు సర్వీసులపై బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రస్తుత సీజన్‌లో మంచుతో పాటు వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నందున ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యం కల్పించాలని డ్రైవర్లకు సూచించారు. డిపో నుంచి బస్సు బయలుదేరే ముందే చెక్ చేసుకోవాలని తెలిపారు. ఈయన వెంట పాలకొండ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు, మెకానికల్ ఏఈ బీవీఎంకే.రాజు, టైర్స్ ఏడీసీ భాసూరు కృష్ణమూర్తి, తదితరులున్నారు.

వినియోగదారులకు బిల్లుల షాక్..!




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- యూనిట్ విద్యుత్‌పై గరిష్టంగా రూ.2.50లు అదనం
- పార్వతీపురం నియాజకవర్గంలో 98.2 లక్షల మంది వినియోగదారులపై బాదుడు
- రేపు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన

పార్వతీపురంటౌన్: సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తన మార్కు నయవంచనతో తానిచ్చిన హామీలకు తూట్లు పొడుస్తూ మరోసారి ప్రజల నడ్డి విరిచారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని, ట్రూఅప్ చార్జీలు కూడా ఎత్తేస్తామని నాడు ఎన్నికల ముందు హామీ ఇచ్చి..తాను ఏ హామీ ఇవ్వలేదంటూ ఇప్పుడు నిస్సిగ్గుగా బుకాయిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచారు. ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట గత నెలలోనే వినియోగదారులపై భారాన్ని మోపిన ప్రభుత్వం ఇప్పుడు ఈ నెల నుంచే మరో బాదుడుకు సిద్ధమైంది. 2026 వరకు ఈ బాదుడును వినియోగదారులు భరించేలా తీర్మానించి కొత్త చార్జీలను అమలు చేశారు.

ఈ మేరకు విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) నుంచి ఆమోదం లభించడంతో ప్రజలపై కొత్త భారం పడనుంది. దీంతో నియోజకవర్గంలో 98.2 వేల మంది వినియోగదారులపై భారాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంతో ఈ నెల 27న కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్వతీపురం నియోజకవర్గంలోని 3 మండలాలు, మున్సిపాలిటీ నాయకులు నిరసనకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.

ఐదు నెలల్లో రెండుసార్లు చార్జీల మోత

ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట ఇటీవలే డిస్కంల ప్రతిపాదనలను నియంత్రణ మండలి ఆమోదించడంతో దాదాపుగా ఎల్‌టీ వినియోగ దారుని విద్యుత్ వినియోగం యూనిట్‌కు గరిష్టంగా రూ.2.50 వరకు పెరిగింది. రెండు నెలల క్రితం యూనిట్ వినియోగ చార్జీలు రూ.1.55 వరకు పెంచేసిన సర్కార్ ఇప్పుడు రెండోసారి మరో రూ.0.92 వరకు పెంచేస్తూ నిర్ణయించింది. దీంతో వరుసగా రెండుసార్లు చార్జీ పెంపు అమలు చేయడంతో విద్యుత్ వినియోగ దారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మొదటి పెంపుతో నవంబర్ నుంచి 2026 జనవరి వరకు, అలాగే రెండో దఫా పెంపుతో ఈనెల నుంచి 2028 నవంబర్ వరకు ఆదనపు బార్జీల భారం పడనుంది.

నిరసనకు సిద్ధం

ఇంధన సర్దుబాటు చార్జీల పెంపు అంశంపై జిల్లా వ్యాప్తంగా వినియోగదారులు, ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళనకు సిద్ధంగా ఉన్నాం. జిల్లా వ్యాప్తంగా నిరసనలకు సంబంధించి పోస్టర్‌లను విడుదల చేశాం. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ వద్ద శుక్రవారం నిరసన తెలిపి జిల్లా స్థాయి అధికారులకు వినతులు అందజేస్తాం. ప్రజల తరపున పోరాటాలకు వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉంది.


– అలజంగి జోగారావు, మాజీ ఎమ్మెల్యే, పార్వతీపురం

ప్రజలపై విద్యుత్ కొనుగోలు భారం

విద్యుత్ కొనుగోలు భారాన్ని ప్రజలపై రుద్దాలని నిర్ణయించుకుని గద్దెనెక్కిన ఆరు నెలల్లోనే రెండుసార్లు చార్జీల పెంపుతో ప్రజలపై భారం మోపుతున్నారు. నిజానికి ప్రభుత్వమే ఈ భారాన్ని భరిస్తే విద్యుత్ చార్జీల పెంపు జరిగే అవకాశం ఉండేది కాదు. అయితే ఈ సర్దుబాటు భారాన్ని తాము మోయలేమంటూ కూటమి సర్కార్ చేతులెత్తేయడంతో విద్యుత్ చార్జీల పెంపు షాక్ రాష్ట్ర ప్రజలకు తప్పడం లేదు. దీంతో విద్యుత్ వినియోగదారుల్లో ఒకింత ఆందోళన నెలకొంది.

బాబు నేతృత్వంలో బాదుడు పాలన

- వైఎస్సార్‌సీపీ పోరుబాటను విజయవంతం చేయండి
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



సాలూరు: రాష్ట్రంలో కూటమి పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ తలపెట్టిన పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ, కరెంట్ చార్జీలను పెంచబోమని, తగ్గిస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు నేడు అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై విద్యుత్‌భారం మోపుతున్నారని విమర్శించారు. పేదల ప్రజలు నడ్డివిరిచేలా మోయలేని భారాన్ని మోపుతున్న ఈ కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారం తగ్గించాలని, ఎన్నికల హామీలను నెరవేర్చాలని కోరుతూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమం చేపడుతోందని తెలిపారు. నియోజకవర్గానికి సంబంధించి సాలూరు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్/ఏడీఈ ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించి వినతిపత్రాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బాధిత విద్యుత్ వినియోగదారులు, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సోదర భావమే క్రీస్తు సందేశం


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: తోటి వ్యక్తులపట్ల సోదర భావాన్ని చూపించి కష్ట సుఖాల్లో పాలుపంచుకోవడమే యేసుక్రీస్తు సందేశమని సాటి మానవుల పట్ల కరుణ, దయ కలిగివుండి ద్వేష భావాన్ని విడనాడాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు నియోజకవర్గంలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద క్రిస్మస్ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జోగారావు కేక్ చేసి పండుగను అందరి మధ్యలో పండగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన విందులో పాల్గొనేందుకు నియోజకవర్గంలోని ప్రజలు, అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో మూడు మండలాల ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్మన్‌లు, మండలాల అధ్యక్షులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మక్కువ: పునీత ఫాతిమా మాత చర్చిలో దైవ సందేశాన్ని వినిపిస్తున్న ఫాదర్ మరియదాస్

సామాజిక సేవతో మానసిక ప్రశాంతత

రేగిడి: సామాజిక సేవ చేయడంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్వీ రమణ అన్నారు. మండలంలోని వావిలవలస గ్రామంలో వెలసిన శ్రీరామ ధర్మ క్షేత్రంలో నిర్వాహకులు వారణాసి జగన్నాథ స్వామి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక దివ్య మహాసభ బుధవారంనిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానవక్తగా పాల్గొన్న రమణ మాట్లాడుతూ చెట్లు ఫలాలను కాసి ఇతరులకు ఉపయోగపడుతున్నాయన్నారు. నదులు ప్రవహిస్తూ ఇతరులకు ఉపయోగ పడుతున్నాయని, గోవులు పాలిచ్చి పరోపకారం చేస్తున్నాయన్నారు. మానవుని శరీరం కూడా పరుల కొరకు ఉపయోగపడాలని, మానవుడు పుట్టినప్పుడు ఏమీ తీసుకురాలేదని, వెళ్లేటప్పుడు కూడా ఏమీ తీసుకువెళ్లడని వివరించారు. దేవుదలకు చెందిన గొర్లె దామోదర రావు, దశమంతుపురానికి చెందిన సతివాడ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు వాజ్‌పేయి

రాజాం సిటీ: తనదైన శైలిలో దేశానికి సేవలందించిన దివంగత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి ఆదర్శప్రాయుడని మానవతా సంస్థ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. స్థానిక మానవతా సంస్థ కార్యాలయంలో వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్వార్థంగా దేశానికి సేవలందించిన వాజ్‌పేయిని నేటి తరం యువకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీవీ అచ్యుత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, మక్క అప్పలనాయుడు, ఆర్‌వీజే నాయుడు, ఎ.వెంకటి నాయుడు, పి.గౌరీశ్వరరావు, ఎల్.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


రాజాం సిటీ: వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న మానవతా సంస్థ సభ్యులు

బొబ్బిలిలో...

బొబ్బిలి: పట్టణంలోని సీనియర్ బీజేపీ నాయకుడు పుల్లెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాజీ ప్రధాని, భారతరత్న అటల్‌బిహారీ వాజ్‌పేయి శతజయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందిద్దాం..

- సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు


సేవా వార్షిక ప్రణాళిక వివరిస్తున్న సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు

పాలకొండ రూరల్: భగవాన్ సత్యసాయి సేవా సమితుల ద్వారా జనరంజకమైన సేవలు జిల్లా వ్యాప్తంగా అందిద్దామని సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సత్యసాయి మందిరంలో ముఖ్య కార్యకర్తల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన ఏడాది నుంచి ప్రణాళికాబద్ధంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధించిన వార్షిక ప్రణాళికను విడుదల చేశారు. అనంతరం బాల వికాస్ విస్తరణ, కేంద్రాల పెంపు, ఇంటింటా సాయి సంకీర్తనలు, సత్యసాయి వ్రతాల నిర్వహణ, తదితర అంశాలపై సభ్యులతో సమీక్షించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పల్ల నేతాజీనాయుడు, రాష్ట్ర ఇన్‌చార్జ్ ఆర్. కిశోర్‌కుమార్, కర్రా సుధాకర్ పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఉప ముఖ్యమంత్రి


పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

మెంటాడ: మండలంలోని పెద్దమేడపల్లి గ్రామ చర్చిలో బుధవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీస్తు జీవితం అందరికి ఆదర్శప్రాయమని, ప్రతి ఒక్కరూ ఆయన సూచించిన మార్గంలో నడిచి ఆపదలో ఉన్న వారికి సాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా చర్చిలో కేక్‌ను కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం పేదలకు వస్త్రాలతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌పీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు, ఉప సర్పంచ్ మయూరి అప్పనాయడు, స్థానిక నాయకులు ఎం.సింహాచలం, దళిత నాయకులు జనార్దనరావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి వాన


నీళ్ల మధ్యలో వరికుప్పలు

- నిండా మునిగిన పత్తి రైతు
- తొలివిడత దళారుల పాలు
- మలివిడత వర్షార్పణం
- కుళ్లుతున్న మొక్కజొన్న, బ్యారన్ పొగాకు మొక్కలు
- అపరాల పంట ఆశలపై నీళ్లు
- అప్పుల ఊబిలో రైతులు


కుళ్లిపోతున్న పత్తి చేను


వర్షానికి తడిచి ముద్దవుతున్న పేలిన పత్తి

సాలూరు రూరల్: గడిచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి పంట చేల గట్టుపై విచారిస్తున్న రైతులు కొంతమంది అయితే..నూర్పి కుప్పలు వేసి మిల్లులకు పంపేలోగా వర్షం కురవడంతో కళ్లాల్లో ధాన్యం రాశుల చుట్టూ చేరిన నీటిని తొలగిస్తూ మరికొంతమంది కాపలా కాస్తున్నారు. ఇంకొంత మంది రైతులు తమ వరికుప్ప ఏమేరకు తడిచిందో? అందులో మొలకలు వస్తున్నాయేమోనని కుప్పల చుట్టూ ప్రదక్షిణ చేస్తూ కాలం గడుపుతున్నారు. మండలంలోని రైతులు ప్రస్తుత తుఫాన్ బీభత్సాన్ని కన్నీటి వానగా గుర్తుంచుకుంటున్నారు.

అకాల వర్షాలతో అన్నదాతకు నష్టం


వరి పొలంలో చేరిన నీటిని బయటికి పంపిస్తున్న రైతు స్వామి నాయుడు

మక్కువ: నాలుగు రోజులు కురుస్తున్న అకాల వర్షాలతో అన్నదాతలు నష్టాలపాలయ్యారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ఆరుగాలం శ్రమించి, పండించిన పంటను కాపాడుకునేందుకు రైతులకు వీలు లేకుండా పోయింది. అకాల వర్షంతో పత్తి, మొక్కజొన్న, వరి రైతులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి దాపురించింది. మక్కువ మండలంలోని శాంతిస్వరం గ్రామానికి చెందిన మత్స స్వామినాయుడు, మత్స గుంపమ్మలకు చెందిన మూడున్నర ఎకరాల్లోని వరిపంట తడిసి ముద్దయింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరిచేను తడిసి మొలకలు రావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో నష్టపోయిన పంటను పరిశీలించి, తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు వరిపంట చివరి దశలోను, కూరగాయలు, మొక్కజొన్న, అపరాల రైతులను తొలి దశలోను, క్షణక్షణం ఆందోళనకు గురి చేస్తున్నాయి. రైతుకు ప్రతి ఏటా అందిన ప్రభుత్వ సాయం ఈ ఏడాది అందక మదుపుల కోసం వ్యాపారుల వద్ద వడ్డీలకు అప్పులు చేసి సాగు చేయగా పంట చేతికి వస్తుందనే సమయంలో తుఫాన్ రూపంలో రైతుకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి సమయంలో ఎవరిని నిందించాలో తెలియక రైతులు అయోమయంలో ఉన్నారు. గతంలో విపత్తు సమయంలో నీట మునిగిన చేలు, నేలకొరిగిన పంటలు పరిశీలించి రైతులకు ఏమేరకు నష్టం వాటిల్లిందోనని అంచనాలు వేసే పనిలో అధికారులు ఉండేవారు. ఈ ఏడాది తుఫాన్ ఒక్కసారి కాకుండా విడతలువిడతలుగా వచ్చి రైతుకు వివిధ రకాలుగా నష్టం వాటిల్లేలా చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో అధికారులు ఏవిధమైన నష్టపరిహారం అందిస్తారో? అసలు తమ కష్టాన్ని గుర్తిస్తారో లేదో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా వరి పంట ముందుగా కోసిన రైతులు మడుల్లో మొక్కజొన్న వేశారు. కొంతమంది రైతులు మెట్టు భూమిలో విత్తనాలు నాటారు. ప్రస్తుతం మొక్కజొన్న మడుల్లో పూర్తిగా నీరు చేరడంతో చిన్న మొక్కలు పూర్తిగా మునిగిపోయి కుళ్లిపోతున్నాయి. ఇలాగే వర్షం మరో రెండురోజులు కొనసాగితే పెద్ద మొక్కలు కుళ్లిపోయో పరిస్థితి ఉంటుందని రైతులు చెబుతున్నారు.

కుళ్లిపోతున్న పొగాకు మొక్కలు

ఈ ఏడాది మండలంలో గిరిజన రైతులు చేలా వరకు బ్యారన్ పొగాకు పంట వేశారు. ఈ మొక్కలు కూడా వర్షానికి కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. మొక్కలను కంపెనీ ఏజెంట్లు ఇచ్చినప్పటికీ ఇప్పటికే ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.10వేల వరకు మదుపులు పెట్టినట్లు రైతులు చెబుతున్నారు. అలాగే టమాటో పంట కుళ్లిపోయి ఎందుకూ పనికిరాకుండా పోతోంది. అపరాల పంటలకు తీరని నష్టం వాటిల్లుతోంది. ఈవిధంగా రైతులు ఈ ఏడాది తుఫాన్ బారిన పడి నష్టపోతున్నాడు.

ఇంకా మడుల్లోనే సీడ్ ధాన్యం

ఏపీసీడ్స్ రైతులకు అందించిన సీడ్ ధాన్యం పంట ఇంకా 70 శాతం వరకు కళ్లాల్లోను, మడుల్లోను ఉండిపోయింది. ఇలాగే వర్షాలు కొనసాగితే ఈ ఏడాది వరి విత్తనాల కొరత ఏర్పడే ప్రమాదం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


బట్టివలస గిరిజనులు వేసిన పొగాకు పంట


నష్టం ముంగిట టమాటో పంట